


ఇంద్రగంటి
జానకీబాల

రామతారకం ఇంట్లో అడుగుపెడుతూంటే ఫోనులో అతని కూతురు తేజ గొంతు ఖంగు మని మోగుతోంది.

"నేనేదైనా కుండబద్దలు కొట్టినట్టే మాట్లాడుతా. అదే నాకిష్టం" అని ఒక క్షణమాగి 'ఓకే - బై' అంటూ ఫోన్ పెట్టేసిన ఆమె ముఖం కాస్తంత కోపంగా, సీరియస్‌గా వుంది.

అక్కడే వున్న మంచం మీద నడుం వాల్చి ఓరకంట కూతుర్ని చూశాడు అరవై అయిదేళ్ల రామతారకం. నల్లరాతి శిల్పంలా వుందనిపించిందతనికి.

అతనికున్న ముగ్గురాడ పిల్లల్లో మూడో పిల్ల తేజస్విని నల్లగా వుండటమే కాకుండా పెద్దగా అందంగా లేకపోవడం వల్ల తండ్రిగా అతను నిరుత్సాహపడుతూ వుంటాడు. ముప్పై ఏళ్లు దాటినా ఇంకా పెళ్లికాలేదని బెంగపడుతున్నా ఆమెలో వున్న ఆత్మాభిమానం, స్వతంత్ర భావాలు, నిక్కచ్చితనం అతనికెంతో గర్వంగా సంతోషం కల్గిస్తూ వుంటాయి.

ముగ్గురూ ఆడపిల్లలే... మగపిల్లవాడు పుట్టలేదని చిన్నతనంలో బాధగా వుండేది. కానీ ఇద్దరాడపిల్లల పెళ్లిళ్లయి అల్లుళ్లు అత్తమామలకి అనుకూలంగా వుండటంతో కొడుకుల్లేరనే బాధ తొలగిపోయింది. అదీకాక కొడుకులున్న తల్లిదండ్రులు కోడళ్ల నిరాదరణకు గురై పొందుతున్న అవమానం చూసినప్పుడు వద్దించే కూతురు తనదైనప్పుడు అల్లుళ్ల గురించెందుకు బాధ అని సరిపెట్టుకున్నారు. తను తన తల్లికి కొడుకునై భార్య యిష్టపడని కారణంగా తల్లిని నాలుగు రోజులు తన దగ్గరుంచుకోలేకపోతున్నాడు. ఆ విధంగా జమాజట్టీల్లాంటి ముగ్గురు కూతుళ్లున్న తనే ధన్యుడు.

రామతారకం కారునలుపుగా వుంటాడు. నల్లగా వున్నప్పటికీ కొందరు అందంగా, దర్జాగా వుంటారు. కానీ అతను దానికి పూర్తి విరుద్ధం. నలుపే కాకుండా, లావుగా, బండగా వుంటాడు. చిన్నప్పటి నుంచీ ఓరే నల్లోడా, ఒరే బండాడా అని పంతుళ్లు పిలవడం, పక్క పిల్లలు నవ్వడం సహజంగా జరిగిపోతూండేవి. అయినా రామతారకం మనసు చిన్నబుచ్చుకుంటూనే వుండేది. ఏమాత్రం చక్కదనం లేకపోవడానికి తగ్గట్టుగా పాత చింతకాయ పచ్చడి లాంటి పేరు అతనికి మరీ బాధగా వుండేది. అతని తల్లి వాళ్ల నాన్నపేరు యిష్టంగా పెట్టుకుంది. ఆపేరునేమైనా అంటే ఆమె ఊరుకోదు.

అయితే ఇంట్లో అందరూ నలుపే - తండ్రి కారునలుపు. అన్నలిద్దరూ అదే రంగు. తల్లి చింతపిక్కరంగు - చెల్లెలు జీడిగింజ - ఇంట్లో తెలుపు నలుపుల సమస్యే లేదు. అతనికే లోలోపల నల్లనివాళ్లంటే ఒళ్లుమంటగా వుండేది. తన రంగెలాగూ మార్చుకోలేడు. పేరైనా మార్చుకుందామంటే అదీ కుదరలేదు. అతని మనసులో బలంగా నాటుకుపోయిన కోరిక ఒకటుంది. అదేమంటే ఏలాగైనా తెల్లటి పిల్లని పెళ్లిచేసుకోవాలి అని.

మధ్య తరగతి కుటుంబం. తండ్రి కామయ్య శాస్త్రి సంపాదన మీదనే గంపెడు సంసారం గడవాలి. అందుకే కొడుకుల్ని ముగ్గుర్నీ ఎస్సెల్సీతో ఆపేసి ఏదో ఉద్యోగాలు చూసుకోమన్నాడాయన. పెద్దవాడు కోర్టులో టైపిస్టుగా, రెండోవాడు ఎలిమెంట్రీ స్కూలు టీచరుగా స్థిరపడ్డారు. పెళ్లిళ్లూ చేసుకున్నారు.

మగవాడికి అందమేమిటి అనుకుందాం అంటే, రామతారకం చదువులోనూ మరీ చురుకైనవాడు కాదు. ఎస్.ఎస్.ఎల్.సి. ఒకసారి ఫెయిలై రెండోసారి పాసయ్యాడు. ఆ తర్వాత ఏంచేద్దామన్నా తోచకుండావున్న సమయంలో తల్లి మంగతాయారు కాళ్లకింద నిప్పులు పోసే

యడం మొదలుపెట్టింది.

"ఏదో ఒకటి చూసుకో. కావాలంటే పరీక్ష లకి ప్రయివేటుగా కట్టుకుందువు గానీ" అంటూ పోరుపెట్టేది.

పక్కింటి వైశంపాయనుడి కూతురు తులసి చూసే చూపులకి రామతారకం గుండె ఝల్లు మంటూ వుండేది. చక్రాల్లాంటి కళ్లల్లోని చమక్ ఇష్టంగానే అనిపించేది.

వైశంపాయనుడు పౌరోహిత్యం చేస్తాడు. డబ్బు బాగా సంపాదిస్తాడు. ఇంట్లో సరుకు, సామాగ్రీ పుష్కలంగా వుంటాయి. ఎప్పుడూ నగానట్రా కొంటూనే వుంటారు. ముగ్గురు మగ పిల్లల తర్వాత పుట్టిన తులసంటే యింట్లో ఎంతో గారాబం. అయినవాళ్ల అబ్బాయి దొరికితే యిచ్చి పెళ్లిచేసి, చదువూ సంధ్యా చెప్పించి, డబ్బూ దస్కం యివ్వచ్చని చూస్తున్నారు.

కానీ తులసి తెల్లని పిల్లకాదు. ముఖం కళగావున్నా, రంగుమాత్రం నలుపు విరిగిందంతే. అందుకే రామతారకం తన ఆకర్షణని పక్కకు తోసేసాడు.

తన మూడో కొడుకు విషయంలో పక్కింటాయన ఏదో ఆశపడుతున్నాడని గ్రహించిన మంగతాయారు బహిరంగంగానే "పౌరోహిత్యం చేసేవాళ్లతో వియ్యమా" అంటూ ఎగతాళి చేసేసింది. వీళ్ల అభిప్రాయం చూచాయగా తెలిసిన తులసి తల్లిదండ్రులు ఆ ఆలోచన విరమించుకున్నారు. అప్పట్నించి తులసి తారకం వైపు చూడటం మానేసింది. ఆమె చూడటం మానేసాక అతని మనసు చిన్నబుచ్చుకున్నా, తెల్లపిల్ల వ్యామోహం అతన్ని చిచ్చుకొట్టింది.

ఇలాంటి సమయంలో ఆవూళ్లో పెట్టిన బీడీల ఫ్యాక్టరీలో రామతారకానికి చిన్న గుమస్తా వుద్యోగం వచ్చింది. ఆ కుటుంబంలో అందరూ ఎంతో ఆనందపడ్డారు. అప్పట్లో వుద్యోగం దొరకడమంటే సామాన్య విషయంకాదు. అందులో వున్న వూళ్లో వుద్యోగమంటే మాటలా? రామతారకానికి గర్వంతో గుండెలుపొంగాయి.

* * *

ఆ రోజు సాయంత్రం గేటు తీసుకుని లోపలికొస్తున్న అన్నగార్ని చూసి ఆశ్చర్యపోయింది మంగతాయారు. చటుక్కున లేచివెళ్లి 'రా అన్నయ్యా' అంటూ ఆహ్వానించింది. లోపల గదిలో ఉన్న కామయ్యశాస్త్రి బయటికి తొంగి చూసి, బావ మరిదినిచూసి నమ్మలేకపోయాడు.

'రావోయి చాన్నాళ్లకివచ్చావు' అంటూ ఎదురెళ్లాడు. వచ్చిన వెంకటేశ్వర్లు ఇద్దరి ఆహ్వానం చూసి, ఆనందపడిపోయాడు. ఇది శుభసూచకమే అనుకున్నాడు. తనువస్తే అరగంట వరకూ గదిలోంచి బయటకు వచ్చేవాడు కాదీ బావగారు. అలాంటివాడిలోని మార్పు చూసి తృప్తిగా నవ్వుకున్నాడు. అందరూ కబుర్లలో పడ్డారు. కుశలప్రశ్నలు, వాకబులు, వివరాలు అయ్యాక వెంకటేశ్వర్లు చల్లగా చల్లకొచ్చిన ముంత బయటపెట్టాడు.

"మా కామాక్షిని మీ తారకంకి చేసుకోమని అడుగుదామని వచ్చాను"

నిజానికి వాళ్లకీ వీళ్లకీ అసలు పడదు. మంగతాయారు పెళ్లయిన నాటి నుంచి ఏవో గొడవలే. తెలీనివాళ్లు వాళ్లు అన్నాచెల్లెళ్లు అంటే నమ్మరు. వీళ్లటు వెళ్లరు, వాళ్లిటు రారు. ఎక్కడైనా కనిపిస్తే పొడిపొడి మాటలు... పలకరింతలు... అంతే. అలాంటిది పిల్లనిస్తామంటూ వచ్చాడంటే కామయ్యశాస్త్రి, మంగతాయారు ఆశ్చర్యపోయారు. వెంకటేశ్వర్లుకి నలుగురాడపిల్లలు, ముగ్గురుమగపిల్లలు. పెద్దపిల్ల కామాక్షి. అప్పట్లో ఆడపిల్లల్ని వదిలించుకోవడం అనే

విషయం – ముఖ్యమైన చాలా విషయాలను పక్కన పెట్టేలా చేస్తుందని అర్థమవుతుంది. నిజానికి అతడు వీళ్లకంటే స్థితిమంతుడు. పదెకరాల పొలం, రెండు ఇళ్లు, మామిడితోట వున్నాయి. అతని భార్య వెంకటలక్ష్మి మహాగడుసు.

మంగతాయారు, కామయ్యశాస్త్రి ఆలోచనలో పడ్డారు. నోరుగల వదినగారంటే తాయారుకి వొళ్లుమంట. ఈ నాని ముచ్చు ఆడపడుచు అంటే ఆ వదినమ్మకీ మహా వెగటు.

"మా వదినకి ఇష్టముందంటారా?" అంది తాయారు.

"భార్యకిష్టంలేకపోతే అతనెలా వస్తాడు...?" అన్నాడు శాస్త్రి. "నిజమే నలుగురాడపిల్లల్ని సాగనంపడం మాటలా?" అంటూ తర్జన భర్జన పడ్డారు. సాయంత్రం రామతారకం చెవిని వేశారు. అతను తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు. అతనికి తెలుసున్నదొకటే... అదేమంటే మావయ్యగారింట్లో అంతా తెల్లగా వుంటారు. ఒకటి రెండుసార్లు కామాక్షిని చూసాడు. సందేహం లేదు. తెల్లగానే వుంటుంది. ఈ అవకాశం వదులుకుంటే మరి రాదు అనుకున్నాడు.

పెళ్లిచూపులు సంప్రదాయంగా జరిపించారు. మంగతాయారనుకుంది... 'పిల్ల పచ్చహా వుంటుంది' అని. రామతారకం తన అదృష్టానికి మురిసిపోవడానికే చాలలేదు ఎంత సమయమూ. కామాక్షి ఎర్రగా వుంటుందిగానీ ఏకోశానా అందమనే మాటే లేదు. గీసేసిన పెండలం దుంపలా వుంటుంది. కళ్లు, ముక్కు, నోరు, పెదాలు అన్నీ కలిసి సొట్టలుపడిన ఇత్తడి పళ్లెంలా వుంటుందా ముఖం. అయితే మాత్రం పిల్ల ఎర్రగా వుంటుంది. అన్నీ చకచకా జరిగిపోయాయి. పెళ్లిలో చిన్నచిన్న గొడవలు జరిగినా, చిర్రుబుర్రులాడినా, తారకం మాత్రం తన తెల్ల పెళ్లాంనే చూస్తూండిపోయాడు.

కార్యం గదిలో ఏడుస్తూకూర్చుంది కామాక్షి. అదంతా భయంగా, సిగ్గుగా సరిపెట్టుకున్నాడు తారకం. మర్నాడు వెంకటలక్ష్మి కూతుర్ని సొంటిపిక్కలెట్టేసి, బుగ్గలు నలిపేసి ఏడ్వాల్సిన ఏడుపంతా ముందే ఏడిపించి గదిలోకి పంపింది. బుంగమూతి వేసుకుని, కందిన ముఖంతో వచ్చిన కామాక్షిని, అదేం పట్టించుకోకుండా తెల్లపిల్ల తమకంలో కౌగిలించుకున్నాడు. తల్లి కంటే ఈ మొగుడే నయమనిపించి కామాక్షి కళ్లు మూసుకుంది.

ఆడపిల్లలకి ఒక యిష్టం, ఒక సరదా, ఒక కోరిక వుంటాయన్న సంగతే పట్టించుకోకుండా వాళ్ల యిష్టాలకీ, అవకాశాలకీ బలిపశువుల్ని చేసి, వదిలించుకుని, దానికి బాధ్యత తీర్చుకున్నామనే అందమైన రంగుపులిమి తృప్తిపడే అనేకమందిలో వెంకటలక్ష్మి, వెంకటేశ్వర్లు ఒక జంట. పిల్లల మంచి చెడ్డలు మనమే చూడగలమనీ, ఇష్టం – అయిష్టం ఏమిటనీ, ఒక మగాడితో జీవించటానికి లైసెన్స్ సంపాదించిపెట్టి వాళ్లని వదిలేస్తామని వాళ్లు భావిస్తున్నారు.

తెల్లని పిల్లని పెళ్లిచేసుకున్నానని పొంగిపోయిన రామతారకం, తాను పాతాళానికి కూరుకుపోయానని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. తన యిష్టానికి తెల్లపిల్లని చేసుకున్నాడుగానీ, తన నల్లముఖం ఆమెకిష్టమా కాదా అని ఆలోచించలేదు. తెలుసుకోలేదు. దాని ఫలితం నరకం.

తల్లిలోవున్న మాటకారితనం, నిస్సాటం, అహంకారం పుణికిపుచ్చుకున్న కామాక్షి దానిని తన అయిష్టం, అసంతృప్తీ జోడించి ముళ్లకంపలా తయారైంది. భర్త కనిపిస్తే చాలు రవరవలాడిపోయేది. ఎంతమాటైనా, ఎంతమందిలో

నైనా అనేసి, హీనంగాచూసి మాటిమాటికీ జగడానికి దిగేది. మంగతాయారు తనదైన పద్ధతిలో దారిలో పెడతానని ముందుకొచ్చినా, తారకం పడనీయలేదు. ఎన్ని తిట్లు తిన్నప్పటికీ అతనికి తన తెల్ల భార్యంటే వ్యామోహంగానే వుండేది.

ఇద్దరాడపిల్లలు పుట్టేసరికి మరీ రేచులా తయారైంది కామాక్షి. ఆమె పొందిన దారిలేని అసంతృప్తి ఆమెని గయ్యాళిగా తయారుచేసేసింది. ఆమె ఏడ్చినప్పుడల్లా ఒక నగో, నత్రో కొనిచ్చి, ఊరడించే తల్లి "మూడో కాన్పు మగపిల్లాడైతే నీ కాళ్లు కడిగి నెత్తిన జల్లుకుంటానని" పొగడ్త మాటలు మాట్లాడేది. మూడోసారి కూడా అమ్మాయే పుట్టేసరికి నిరుత్సాహపడ్డారు. ఇక పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడ్డారు.

ఆడపిల్ల అనగానే ఒక భూతంలా చూసి, చిన్నప్పటినుంచీ పెళ్లి పెళ్లి పెళ్లి అని గోల చేస్తూ వాళ్లని సరైన మార్గంలో ఎదగకుండా చేసేస్తున్నారు. కానీ కామాక్షి అలా చెయ్యలేదు. వాళ్లకి చదువు ముఖ్యం అనుకుంది. పుట్టిన ముగ్గురు పిల్లలు సామాన్యంగా నల్లగానే ఉన్నారు గానీ, కామాక్షి ఆశించినట్టుగా ఎర్రగా లేరు.

కామాక్షి అసంతృప్తి గుట్టలు గుట్టలుగా పెరిగి ఆమెని పూర్తిగా కప్పేసింది. ఇష్టంలేని మొగుడు... డబ్బు లేదు, వెనకాల ఆస్థిపాస్తులు లేవు. అతనికి పెద్ద వుద్యోగం లేదు, హోదా లేదు, ఇల్లు లేదు. వంటినిండా నగలులేవు, నాలుగురకాల పట్టుచీరలు లేవు. ఇవే ఎప్పుడూ ఎత్తి చూపుతూ సాధిస్తూ రవరవలాడిపోతూ వుంటుంది కామాక్షి. అన్నింటికీ రామతారకం మౌనమే సమాధానం. భార్యాభర్తలు వేరు వేరు అసంతృప్తులతో వున్నప్పటికీ, ఇద్దరికీ పిల్లలే ఎంతో ఊరటగా వుండేవారు.

ఈ ముప్పై, నలభై సంవత్సరాల కాలంలో మన కుటుంబాలలో వచ్చిన ముఖ్యమైన మార్పు తల్లిదండ్రులకీ,పిల్లలకీ మధ్యవున్న అనుబంధం. చిన్న కుటుంబాలుగా మారిన సందర్భంలో పిల్లలు తండ్రి దగ్గర పొందిన చనువు అందరి ఆలోచనల్నీ మార్చింది. స్వేచ్ఛగా మాట్లాడడం, సంప్రదించటం, వాళ్ల అభిప్రాయాలు నిర్భయంగా ప్రకటించటం పిల్లలకి సహజమైపోయింది. ఈ మార్పు మధ్యతరగతి కుటుంబాలలో గొప్ప చైతన్యం తీసుకొచ్చింది.


రామతారకం ముగ్గురు కూతుళ్లూ చాలా చురుకైనవాళ్లు. పెద్దపిల్ల సరస్వతి చాకులాంటి పిల్ల. రెండోది బాకు. మూడో పిల్ల తేజస్విని తుపాకీగుండు. ముగ్గురూ చదువుల్లో ఫస్టు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆత్మాభిమానంతో బాటు మంచి క్రమశిక్షణగలవాళ్లు. వాళ్లకి తండ్రి మీద ఎనలేని ప్రేమ, గౌరవం. తల్లి మీద ఎప్పుడైనా కాస్త విసుగొచ్చినా, ఆమెకేం కావాల్సినా బాధ్యతగా చూసే ఓర్పూ, కమిట్‌మెంట్.

రామతారకం తన తండ్రితో ఎప్పుడూ స్వేచ్ఛగా, చనువుగా మసలిన గుర్తే లేదు. ఎప్పుడూ భయం. ఏం కావాల్సివచ్చినా తల్లి ద్వారా రాయబారమే. ఈ రోజు తన కూతుళ్లు తన భుజాలు పట్టుకు వేలాడుతూ, గారాలుపోతుంటే తను పొందుతున్న ఆనందం అప్పట్లో ఏ తండ్రీ పొందివుండడు అనుకుంటాడతను.

కూతుళ్ల గురించి ఆనందించటంలో తారకం, కామాక్షీ ఒకటే. ధైర్యంగా పిల్లలు వారి అభిప్రాయాలు చెప్తుంటే ఇద్దరికీ సంతోషమే. తాము కోల్పోయినదేదో దొరికినట్లుంటుంది.

* * *

"అవును నేనంత ఫెయిర్ కాను. ఆ విషయం తెలుసుకునే రమ్మను. వచ్చాక పిల్ల నలుపూ, గిలుపూ అంటే మర్యాదగా వుండదని




చెప్పు" గట్టిగా, భయం లేకుండా కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది తేజూ.

"నాన్సెన్స్. తెల్లవాళ్లకీ తెల్లవాళ్లే కావాలి. నల్లవాళ్లకీ తెల్లవాళ్లే కావాలి. నల్లగా వుంటే అందరికీ లోకువే. ప్రతీవాళ్లకీ తెల్లతోలు కావాలి".

"అమెరికా వెళ్లిన మనవాళ్లకి కూడా తెల్లవాళ్లంటేనే యిష్టంట. వాళ్లంటేనే మోజుట. అక్కడ కూడా నల్లవాళ్లంటే చిన్న చూపేనట. ఇదే మరి రేసిజం అంటే" గట్టిగాపైకి మాట్లాడుకుంటూ పుస్తకాలు సర్దుతోంది తేజూ. అప్పుడే బయటనుంచి వచ్చిన కామాక్షి భర్త పడుకునుండటం చూసి "ఏమిటీ పడుకున్నారు? ఉద్యోగానికెళ్లే పనిలేదా" అంది. రిటైరయి నాలుగేళ్లయినా, ఇంకా ఏదో చిన్న వుద్యోగం చేస్తూ కాలక్షేపం చేస్తున్నాడు రామతారకం.

తల్లి మాటలకి తేజూ ఆమె మీద విరుచుకుపడింది. "ఎన్నాళ్లు చేస్తారే నాన్నగారు వుద్యోగం? ఆ... ఎన్నాళ్లు చేస్తారు? ఇంక చెయ్యరు. నీకేం కావాలో చెప్పు? నాకు బోలెడు జీతం కదా. నేను తెచ్చిస్తాను" అంటూ అరిచింది.

"నీ డబ్బు నీ కట్నానికి వద్దా? మీ నాన్నగారి దగ్గరేం లేదు మూట... యివ్వడానికి" అంటూ కామాక్షి అంతగానూ అరిచింది. తేజూకి ఒళ్లు మండిపోయింది.

"నువ్వు మరొక్క మాట మాట్లాడితే ఊరుకోను. లప్పబాగా గుమ్మరిస్తే పచ్చహావున్నవాడు నాకొస్తాడనేగా నీ ఆశ. నాకేం వద్దు. నాకెవరు కావాలో నేను చూసుకుంటా" అంది. కామాక్షి ఒక్కసారి తేరిపారి కూతుర్ని చూసింది. "నేనెప్పుడూ ఇంత గట్టిగా, నాకిష్టం లేదు. నాకు వద్దు అంటూ ఎందుకు చెప్పలేక పోయాను?" అనుకుంది మనసులో. రామతారకం కూతుర్ని గర్వంగా చూసాడు. తెల్లతోలుకోసం ఆశపడి నేనెంత భంగపడ్డాను. తెల్లని వెలుగు కనిపించనంత చీకట్లో వుండిపోయాను. ఇప్పుడు నా ఈ తేజూ తెల్లగా ధగధగా మెరుస్తూ కనబడుతోంది."

అతను విశ్రాంతిగా పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు. ●